

ట్రయల్ సమీక్ష కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కడప

సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ శుక్రవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో ట్రయల్ సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెయిల్స్, అప్పీళ్ళు, ష్యూరిటీలు, నగదు సర్యూటీలు, సాధికార కమిటీ, చట్టపరమైన సహాయం డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్, మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్లు ఎమ్ శాంత, ఎం.వి.రవి కుమార్, ఎం చంద్రకాంతమ్మ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్లు పి.మనోహర్, ఎం సౌజన్య, ఎస్. నీలకంఠేశ్వర రెడ్డి, షేక్ అక్బర్ అలీ, ఎ.ఎస్.రవితేజ, పి. ప్రవీణ్ కుమార్, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పేదింట ఉడకని కందిపప్పు

- రేషన్‌లో కోతలే కోతలు
- కందిపప్పు సహా సరుకుల పంపిణీ బంద్
- ప్రభుత్వ తీరుపై కార్డు దారులు తీవ్ర అసంతృప్తి
- బహిరంగ మార్కెట్లో మండుతున్న కందిపప్పు, నూనెలు



ప్రజాశక్తి - పులివెందులటౌన్

పౌరసరఫరాల గోదాముల నుంచి కందిపప్పు, గోధుమపిండి, రేషన్ డీలర్లకు రావడం లేదు. కేవలం బియ్యం, చక్కెర వచ్చాయి. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.170-180కు, గోధుమ పిండి రూ.60కు చేరింది. ఇంటింటికీ రేషన్ పంపిణీలో రూ.67 కే కిలో కందిపప్పు, రూ.20కే కిలో గోధుమ పిండి ఇచ్చేవారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు ప్రతినెలా ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు నాలుగు రకాలే అయినా వాటిని కూడా పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు. బియ్యం మినహా మిగతా మూడు సరుకులను అందించిన దాఖలాలు లేవు. కార్డుదారులకు ప్రతినెలా అందించే కందిపప్పు గత ప్రభుత్వం సరిగా ఇవ్వలేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాలశాఖ నెలకొనేల రేషన్ సరుకుల్లో మార్పులు తెస్తామని చెప్పినా అది ప్రకటనలకే పరిమితమవుతోంది. రేషన్ సరుకుల్లో కోత విధిస్తూ వస్తున్న ప్రభుత్వం ఈ నెల కూడా బియ్యం, పంచదారకే పరిమితం చేసింది. కార్డుదారులకు వైసిపి ప్రభుత్వం నిలిపివేసిన రాయితీ కందిపప్పు సరఫరాను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించినా అవి కొన్ని నెలలకే పరిమితమైంది. కందిపప్పు సరఫరా పూర్తిగా నిలిపేయడంపై కార్డుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రేషన్ సరుకుల కోతతో పేదలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రజలు రాయితీపై పంపిణీ చేయాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని కార్డుదారులు విమర్శిస్తున్నారు. కందిపప్పుతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేదలపై ఆర్థిక భారం పడుతుందంటూ వారు ఆవేదన చెందుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను దారుణంగా దెబ్బ తీసింది. పౌర సరఫరాల వ్యవస్థ మొత్తం గడిచిన ఐదేళ్లలో నిర్వీర్యమైంది. కూటమి ప్రభుత్వం రాకతో పరిస్థితి మారుతుందని, గతంలో మాదిరిగా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి, రాగులు, శనగలు అందుతాయని నిరుపేదలు ఆశపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి రెండు నెలలు కొన్ని ప్రయత్నాలు చేసినా అవి మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. కంది పప్పు, రాగులు, జొన్నల నిల్వలు లేకపోవడంతో వాటి సరఫరాలో ఆటంకాలు తలెత్తుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. సరుకుల రవాణాలో తలెత్తిన సమస్యలను పరిష్కరించి, తక్షణ ప్రాతిపదికన కందిపప్పు, రాగులు, జొన్నలు, గోధుమ పిండి వంటి సరుకులు సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. కందిపప్పు బహిరంగ మార్కెట్లో కిలో రూ.175 నుంచి రూ.180 వరకు ధర ఉంది. ప్రభుత్వం కార్డుదారులందరికీ ప్రతి నెల కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో సామాన్యులు ఇంట్లో పప్పు ఉడకడంలేదు. బహిరంగ మార్కెట్లో ధర పెరగడంతో ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం కార్డుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మార్కెట్లో కంది పప్పు ధర పెరిగే సమయంలో గతంలో కార్డుదారులకు రేషన్ సరుకుల్లో ఇతరులకు రైతు బజార్లలో సబ్సిడీపై సరఫరా చేయడాన్ని పౌరసరఫరాలశాఖ పూర్తిగా విస్మరించింది. నూనెల ధరలు సలసల కాగుతున్న నేపథ్యంలో చౌక ధరల్లో పామాయిల్ అందించాల్సిన అవసరం ఉంది. నిత్యావసర ధరలు మండిపోతున్న తరుణంలో రేషన్ ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తే పేదల ఆకలి తీరుతుంది.

ఇంటింటికి సరఫరా చేయని రేషన్

ఎండియు వాహనాల ద్వారా రేషన్ ఇంటింటికి సరఫరా చేయాలి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇది అమలు కావడం లేదన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం పులివెందులలో ఒకటి, రెండు వాహనాలు మాత్రమే నామమాత్రంగా సరఫరా చేస్తున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఎండియు వాహనాల ద్వారా సరఫరా చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినా అమలు మాత్రం కాలేదు. కొంతమంది రేషన్ డీలర్లు 5వ తేదీ వరకు మాత్రమే రేషన్ ఇచ్చి షాపులు మూసివేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ప్రతి నెల 15 వరకు సరఫరా చేయాలని రేషన్ కార్డుదారులు కోరుతున్నారు.

రేషన్ సరఫరాపై అధికారుల నియంత్రణ

రేషన్ కార్డుదారులకు కూటమి ప్రభుత్వంలోనూ కష్టాలు తప్పడంలేదు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఎండియు వ్యవస్థతోనే ఇబ్బందులు పడుతున్న కార్డుదారులకు, రేషన్ సరుకుల సరఫరాలో అధికారుల నియంత్రణ చర్యలు కొత్త కష్టాలు తెచ్చి పెట్టింది. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి జరగాల్సిన పంపిణీలో అధికారుల నిర్వాకంతో జాప్యం జరుగుతోంది. కొత్త కొత్త నిబంధనలను తెర మీదకు తెచ్చి రేషన్ పంపిణీలో జాప్యం చేస్తున్నారు.

అరకొరగానే సరఫరా..

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అరకొర సరఫరా మాత్రమే చేస్తున్నారు. రేషన్ షాపుకు వెళ్తే కొద్దిమందికే కందిపప్పు ఇస్తున్నారు. ఇదేంటని రేషన్ షాప్ డీలర్లను అడిగితే సరఫరాలేదని చెప్తున్నారు. ప్రభుత్వం మూడు నెలల నుంచి కొద్దిమందికి కూడా ఇవ్వడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని కందిపప్పు అందించాలని కోరుతున్నాం.

- ఉత్తమ్మ, గృహిణి, పులివెందుల.

నాలుగు నెలలుగా ఇవ్వడం లేదు

రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. జనవరిలో మాత్రం ఇచ్చారు. కొంతమందికి ఆ నెల కూడా ఇవ్వలేదు. ఈ నెలకు సంబంధించిన కందిపప్పు రాలేదని రేషన్ విక్రయించే సిబ్బంది చెబుతున్నారు. పప్పు ధర కూడా పెరిగిపోయింది. రూ.170 పెట్టి కొనుక్కునే పరిస్థితి మాకు లేదు. మాలాంటివారు కందిపప్పు కూడా తినలేని పరిస్థితి ఏర్పడింది.

- సావిత్రి, వ్యవసాయ కూలీ, పులివెందుల.



సరుకులు పంపిణీకి వచ్చిన ఎండియు వాహనం (ఫైల్ ఫోటో)

బాలికలపై కంప్యూటర్ ఆపరేటర్ లైంగిక వేధింపులు

- దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు, బంధువులు
- అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలింపు
- కీచక ఉపాధ్యాయుడి ఘటన మరువక ముందే..
- అధికారులు, పోలీసుల నిర్లక్ష్యం వల్లే పునరావృతం

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 4వ తరగతి విద్యార్థినిపై కీచక ఉపాధ్యాయుడు చేసిన లైంగిక వేధింపులు సంఘటన మరువక ముందే శుక్రవారం స్థానిక సుందరయ్య కాలనీ సమీపంలో ఉన్న ఎవిఆర్ పాఠశాలలో మరో సంఘటన చోటు చేసుకుంది. 6వ తరగతి చదవుతున్న విద్యార్థినులపై ఆ పాఠశాలలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, బంధువులు అతడికి దేహశుద్ధి చేశారు. పోలీసులు అతన్ని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు... ఎవిఆర్ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేట్ పెంచలయ్య 6వ తరగతి విద్యార్థినులపై కొద్ది రోజులుగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. విద్యార్థులు గురువారం రాత్రి విషయాన్ని తమ తల్లిదండ్రులకు తెలిపారు. శుక్రవారం ఉదయం వారు పాఠశాలకు చేరుకుని కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్య ఎవరని అతడినే అడిగారు. సెలవుపై వెళ్లాడని సమాధానం చెప్పాడు. కొంత సమయం తర్వాత లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి అతనే అని తెలుసుకొని దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంఘటన గల కారణాలను విచారించి చట్టపరంగా కోర్టు ద్వారా శిక్ష పడేలా చేస్తామని తెలిపారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే ఇంతటి ఘాతుకానికి పాల్పడ్డం చాలా ఆశ్చర్యం కలిగిస్తుందని, ఆడపిల్లలను పాఠశాలలకు పంపించాలంటేనే భయమేస్తుందని, తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల చుట్టుపక్కలంతా కాయకష్టం చేసుకునే రోజువారి కూలీలేనని, తాము చదువుకోలేకపోయామని పిల్లలను బాగా చదివించి మంచి ఉద్యోగాలు చేయాలని కోరికతో చదివిస్తున్నామని చెప్పారు. పల్లెల నుంచి పట్టణం వచ్చి పాఠశాల దగ్గరలో అద్దె ఇంటిలో జీవనం సాగిస్తూ రెక్కలు ముక్కలు చేసుకుని అడిగినంత ఫీజులు చెల్లించి చదివిస్తున్నామని తల్లిదండ్రులు వాపోయారు. లైంగికంగా వేధించడమే కాకుండా ఈ విషయం ఇంట్లో చెప్తే దెబ్బలు పడతాయని బెదిరించాడని, ఇదంతా పాఠశాల ప్రిన్సిపల్ పర్యవేక్షణ లోపమేనని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా ప్రిన్సిపల్ తనకు తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ఏంటని ప్రశ్నించారు. అధికారులు, పోలీసులు డబ్బులకు ఆశపడకుండా ఇలాంటి ఉపాధ్యాయులను కఠినంగా శిక్షించి నప్పుడే, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని అక్కడి ప్రజలు తెలిపారు.

పెంచలయ్యపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

బద్వేలు పట్టణంలోని ఎవిఆర్ పాఠశాల ఆరోతరగతి విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్యపై పోక్సో కేసు నమోదు చేయాలని, పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. శుక్రవారం డిఇఒ కార్యాలయం ఎఒ మునీర్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఇలాంటి సంఘటను పునరావృతం కాకుండా ఉండాలంటే చర్యలు కఠినంగా ఉండాలని పేర్కొన్నారు.



కంప్యూటర్ ఆపరేటర్‌కు దేహశుద్ధి చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

ఎవిఆర్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి : డివైఎఫ్ఐ


కడప అర్బన్ : బద్వేలు పట్టణంలోని ఎవిఆర్ స్కూలు గుర్తింపును విద్యాశాఖ అధికారులు రద్దు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్లో విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన మరువక ముందే ఇప్పుడు ఎవిఆర్ స్కూల్‌లో కంప్యూటర్ ఆపరేటర్ విద్యార్థినులపై అసభ్య ప్రవర్తన గురిచేయడం దారుణమైన విషయమన్నారు. తక్షణమే విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన కంప్యూటర్ ఆపరేటర్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పోక్సో కేసు నమోదు చేయాలని నిరసన

పట్టణంలోని ఎవిఆర్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థునులపై లైంగిక వేధింపులకు పాల్పడిన కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్యపై పోక్సో కేసు నమోదు చేయాలని, ఎవిఆర్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎవిఆర్ స్కూల్ ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మొన్న లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన మరువకముందే ఇప్పుడు కంప్యూటర్ ఆపరేటర్ ఆరో తరగతి చదువుతున్న విద్యార్థినిలపై అసభ్య ప్రవర్తన గురి చేయడం దారుణమన్నారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ప్రయివేట్ పాఠశాలలో నిత్యం ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ సంఘటనలపై జిల్లా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే డివైఎఫ్ఐ యువజన సంఘం మిగతా ప్రజా సంఘాలను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్ కే ఆదిల్ ,బద్వేల్ అధ్యక్ష కార్యదర్శులు ముడమాల ఓబుల్ రెడ్డి, ఉప్పలూరు బాల గురయ్యా, పట్టణ నాయకులు శ్రీనివాసులు, షఫీ ,మాబాషా పాల్గొన్నారు.

ఒంటిమిట్టకు బ్రహ్మోత్సవ శోభ

- నేడు అంకురార్పణ, రేపు ధ్వజారోహణం
- 11న సీతారాముల కల్యాణం



ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఒంటిమిట్టకు బ్రహ్మోత్సవ శోభ వచ్చింది. నేటి నుంచి మొదలయ్యే కోదండ రామాలయం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు, పనులు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణం, ఆలయాన్ని దీపాలతో అలంకరించారు. శ్రీరామనవమిపై ప్రచారం కల్పించేందుకు భారీ ఫ్లెక్సీలు, గోడపత్రాలు అంటించారు. హరిత శోభకోసం ప్రత్యేకంగా మొక్కలను తెప్పించారు. కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 11వ తేదీన జరుగనున్న సీతారాముల కల్యాణ ఘట్టానికి యుద్ధ ప్రాతిపదికన కల్యాణ వేదికను ముస్తాబు చేస్తున్నారు. కోదండరామస్వామి వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు శనివారం సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులపాటు బ్రహోత్సవాల నిర్వహణకు టిటిడి యంత్రాంగం భారీగా ఏర్పాట్లు చేసిన సంగతి తెలిసిందే. ఉదయం 4 నుంచి 6 గంటల వరకు వ్యాసాభిషేకం (మూలవర్లకు అభిషేకం), 7.30 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 10 గంటలకు శ్రీరామనవమి ఆస్థానం, స్నపన తిరుమంజనం ఉంటుంది. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారు. శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి.

రేపు ధ్వజారోహణం

ఈ నెల 6న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి 11 .15 గంటలకు వృషభ లగ్నంలో ధ్వజారోహణం ఉంటుంది. ఆ తర్వాత పోతన జయంతి, కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శేష వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శనమిస్తారు.

11న శ్రీ సీతారాముల కల్యాణం

ఏప్రిల్ 11వ తేదీన రాత్రి 6.30 నుంచి 8.30 గంటల వరకు సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహిస్తారు. అనంతరం గజ వాహనసేవ నిర్వహిస్తారు. 12న రథోత్సవం నిర్వహిస్తారు. 14న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 15న సాయంత్రం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.

నేడు, రేపు కవి సమ్మేళనం

శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినం, శ్రీపోతన జయంతిని పురస్కరించుకుని టిటిడి హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో సాయంత్రం 4 నుండి సాయంత్రం 7 గంటల వరకు కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. పోతన భాగవతం, రామాయణంలోని కాండాలపై కవి సమ్మేళనం ఉంటుంది.

పాఠశాలల విలీనాన్ని ఆపాలి

- ఎమ్మెల్యే మాధవికి యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

గత ప్రభుత్వ హయాంలో తీసుకు వచ్చిన జీవో నంబర్ 117,128 వల్ల కుదేలైన ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడడానికి ఈ ప్రభుత్వం చొరవ చూపాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. శుక్రవారం కడప ఎమ్మెల్యే మాధవిని వారి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన 117, 128 జీవో నంబర్లను ఈ ప్రభుత్వం రద్దు చేసిందని, అయితే ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్పు చేస్తున్నట్లుగా ప్రకటించి ప్రాథమిక విద్యారంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీయడానికి సిద్ధమైందని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో 60 పైబడి విద్యార్థులు ఉన్న పాఠశాలలను మోడల్ ప్రైమరీగా ఏర్పాటు చేసి 5వ తరగతులకు ఐదుగురు టీచర్లను కేటా ఇస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని చెప్పారు. కొన్ని సందర్భాలలో తల్లిదండ్రుల కోరితే 45 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అమలు చేయడంలో భిన్నమైన పద్ధతులను అవలంభించి సమీప గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడంతో పాటు కనీసం సోషల్ బారియర్స్ నేచురల్ బారియర్స్ ఉన్నచోట కూడా ప్రాథమిక పాఠశాలలను కొనసాగించకుండా విలీనం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల ఎంతోమంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. 60 మంది పైబడి విద్యార్థులు ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలలను దూరంతో సంబంధం లేకుండా ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ప్రస్తుత విలీన ప్రక్రియతో ముందుకు వెళితే గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే పాఠశాలల విలీన ప్రక్రియను ఆపివేసి ప్రజా ఆమోదయోగ్యమైన నిర్ణయాలను అమలుపరచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి, జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.కృష్ణారెడ్డి, డి.రూతు ఆరోగ్య మేరి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.చంద్రశేఖర్, కేదార్నాథ్, వెంకటరమణ, సుబ్బారావు, పి.చంద్రశేఖర్, టి.పెంచలయ్య, శంకర్ రెడ్డి, ప్రకాష్ బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్ని ప్రాధాన్యతా రంగాలను మరింత పటిష్టం చేసి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించాల్సిన ప్రగతి.. తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో డివిజన్ల వారీగా టార్గెట్లు కేటాయించి సాగుబడి విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు అధిక దిగుబడులను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జాతీయ రహదారుల విస్తరణ, సోలార్ పార్కుల ఏర్పాటు కోసం చేపట్టిన భూసేకరణ, అటవీ, పర్యావరణ అభ్యం తరాలు, లీగల్ క్లియరెన్స్ ప్రక్రియలను పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబందిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ పెండెన్సీపై శుక్రవారం కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జెసి అదితి సింగ్, డిఎఫ్ఓ వినీత్ కుమార్‌లతో కలిసి సంబంధిత తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా బెంగుళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేస్తోందని పేర్కొన్నారు. అందుకు సంబంధించి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి భూములు కోల్పోయినవారికి పరిహారం ఇస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మూడు రకాలైన సోలార్ అనుబంధ పవర్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను, ఇతర అనుమతులను క్లియర్ వెంటనే.క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు, పులివెందుల ఆర్‌డిఒలు సాయిశ్రీ, చిన్నయ్య, ఎన్‌హెచ్ఎఐ ఎస్‌డిసి వెంకటపతి, పీడీ అశోక్ కుమార్, డిప్యూటీ మేనేజర్లు వేణుగోపాల్, సుదర్శన్ కుమార్, ఆర్అండ్‌బి నేషనల్ హైవే ఇఇ విజయ్ భాస్కర్ రెడ్డి, నెడ్ క్యాప్ జిల్లా అభివృద్ధి అధికారి ఎల్లారెడ్డి, సోలార్ పవర్ ప్రాజెక్టుల ప్రనిధులు, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

దాతృత్వంలో అద్వితీయుడు 'సి.కె.సంపత్ కుమార్'

ప్రజాశక్తి - కడప అర్బన్

బ్రౌన్ బంగళా ప్రదేశంలో బ్రౌన్ జ్ఞాపకార్థం స్మారక గ్రంథాలయం ఆవిర్భవించడానికి ప్రధాన కారకులైన సి.కె.సంపత్ కుమార్ దాతృత్వంలో అద్వితీయుడని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం స్థలదాత, ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ సి.కె.సంపత్ కుమార్ 23వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా సి.కె.సంపత్ కుమార్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1976లో యజమాని సి.ఆర్.కృష్ణస్వామిని కలిసి, శిథిలాలుగా ఉన్న బ్రౌన్ బంగళా 20 సెంట్ల స్థలాన్ని సి.పి.బ్రౌన్ జ్ఞాపకచిహ్నంగా నిర్మించే గ్రంథాలయానికి విరాళంగా ఇవ్వమని కోరారని తెలిపారు. సి.ఆర్.కృష్ణస్వామి పెద్దమనసుతో అంగీకరించడం విశేషమన్నారు. అలా మాట ఇచ్చిన కృష్ణస్వామి 1978లో చనిపోగా ఆయన కుమారుడు సి.కె.సంపత్ కుమార్ తండ్రిమాటకు కట్టుబడి 1989, అక్టోబర్ 21న 20 సెంట్ల స్థలాన్ని బ్రౌన్ స్మారక గ్రంథాలయం కోసం రిజిస్టర్ కూడా చేయించారన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సంపత్ కుమార్ సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్టుకు అధ్యక్షులుగా ఉండి గ్రంథాలయ నిర్మాణానికి, అభివృద్ధికి చాలా సహకరించారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణ, ఎం.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యసాధన కోసం కృషి చేయాలి : ఎస్పి

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో స్టూడెంట్ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 51వ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. సలీం బాషా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్పి ఇ.జి.అశోక్ కుమార్, గౌరవ అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ లయన్ చిన్నపరెడ్డి హాజరయ్యారు. ఎన్‌సిసి కేడెట్లు ఎస్పిని గౌరవ వందనముతో ఆహ్వానించారు . ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష సాధన కోసం నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ఉన్నత పదవులు సాధించాలని చెప్పారు. ప్రతి విద్యార్థి తమ గురువులు చెప్పిన మాటలను శ్రద్ధగా ఆలకించి, జ్ఞానాన్ని సంపాదించి, విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాట్లాడుతూ తమ విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదివిన ట్లయితే అనుకున్న లక్ష్యాలను అతి సులభంగా సాధించవచ్చని చెప్పారు. లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థులు అత్యంత నైపుణ్యం గల వ్యక్తులని, తమ నైపుణ్యముతో, చక్కటి ప్రణాళికతో విద్యను అభశించినట్లయితే అనుకున్న లక్ష్యాలను అతి సులభంగా సాధించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.గురువు రెడ్డి, స్టూడెంట్ చైర్ పర్సన్ షేక్ ఆయేషా, విద్యార్థులు, ఎన్సిసి, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

పేపర్ లీకేజీలో వేంపల్లె వాసి అరెస్టు!

ప్రజాశక్తి - వేంపల్లె

పదవతరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పేపర్ లీకేజీలో వేంపల్లెకు చెందిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి గణితం పరీక్ష రోజున కమలాపురం నియోజకవర్గంలోని వల్లూరులో లీకేజీ అయిన విషయం తెలిసిందే. పేపర్ వేంపల్లెలోని ఒక ప్రయివేటు పాఠశాలకు పార్వడ్ అయినట్లు తెలిసింది. దీంతో పేపర్ లీకేజీకి కారణమైన కమలాపురం పోలీసులు అప్పట్లో 9 మందిని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో 8 మందికి బైయిల్ వచ్చింది. అలాగే పేపర్ లీకేజీలో కారణమైన వేంపల్లెకు చెందిన మరో వ్యక్తిని కూడ శుక్రవారం కమలాపురం పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. అరెస్టు చేసిన వ్యక్తిని కమలాపురం పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

మోడల్ పరీక్షను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కడప

కడప బార్ అసోసియేషన్ హాల్‌లో ఈనెల 5న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు భారత న్యాయవాదుల సంఘం(ఐఎఎల్) ఆధ్వర్యంలో నిర్వహించే జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని కడప బార్ సోసియేషన్ అధ్యక్షుడు జీ.వి.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రవదన కోరారు. శుక్రవారం కడప బార్ అసోసియేషన్ కార్యాలంయలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 16న నిర్వహించే జూనియర్ సివిల్ జడ్జి పరీక్షకు ముందుగా నిర్వహించే ఐఎఎల్ మోడల్ పరీక్ష చాలా ఉపయోగకరంగా ఉంటుందని వారు అన్నారు. విలేకరుల సమావేశంలో కడప బార్ ఉపాధ్యక్షులు ఉమాదేవి, ట్రెజరర్ సురేష్, స్పోర్ట్స్ సెక్రటరీ నంద్యాల చిన్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థులను వారి అభిరుచులకు తగ్గట్టుగా పెంచాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీ

నవీన టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను తయారు చేయాలని ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అక్కాయపల్లెలోని సాయిబాబా పాఠశాలలో స్కిల్ కార్నివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను వారి అభిరుచులకు తగ్గట్టుగా పెంచాలని తెలిపారు. చిన్నప్పటి నుంచి విద్యార్థులలో సమయాభావన, విలువలు పెంపొందించేటట్లు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆధునిక టెక్నాలజీ కనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల మీద ఉందని చెప్పారు. 33 సంవత్సరాలుగా సాయిబాబా విద్యాసంస్థలు ప్రథమ స్థానంలో నిలుపుటకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎం.వి.సాయి సుధీర్ కుమార్ రెడ్డి పాఠశాల సిఇఒ, కార్పొరేటర్ ఎం.వి.శ్రీదేవి, హెడ్‌మాస్టర్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సిబ్బంది హాజరు పరిశీలిస్తున్న ఎంపిడిఒ ముకుందరెడ్డి

కొత్తపల్లె సచివాలయం విహెచ్ఎకు మెమో

ప్రజాశక్తి - ముద్దనూరు

విధుల పట్ల నిర్లక్ష్యం వహించి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన కె.కొత్తపల్లె గ్రామ పంచాయతీ సచివాలయం గ్రామ ఉద్యాన సహాయ అధికారి (విహెచ్ఎ) పవన్ కుమార్‌కు ఎంపిడిఒ ముకుందరెడ్డి మెమో జారీ చేశారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీని శుక్రవారం ముకుందరెడ్డి సందర్శించారు. అందులో భాగంగా గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు పట్టిక పలు రికార్డులను పరిశీలించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామ ఉద్యాన సహాయ అధికారి పవన్ కుమార్ ముందస్తుగా ఎలాంటి అనుమతి లేకుండా నాలుగు రోజుల నుంచి విధులకు గైర్హాజరైనట్లు చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు విహెచ్ఎకు తక్షణమే మెమో జారీ చేసినట్లు తెలిపారు. విధులకు గైర్హాజరు పట్ల సంజాయిషీ ఇవ్వాలని పవన్ కుమార్‌కు ఆదేశించినట్లు చెప్పారు. అనంతరం గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఉపాధి పనులు, వాటర్ ట్యాంక్, 104 వాహనం, పారిశుధ్యం పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణమ్మ, ఎపిఒ గంగయ్య, కార్యదర్శి సౌభాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ తహశల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యాలయ ఆవరణలో తహశీల్దార్, పోలీస్‌స్టేషన్, ఆర్‌డిఒ, ఎంపిడిఒ కార్యాలయాలు ఉన్నాయని, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడికి వస్తుంటారని వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీను, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఒను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఉప విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న మీనాక్షిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం డిప్యూటీ డిఇఒ కార్యాలయం ఎదుట వారు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు ఓబులేష్ కత్తి, గడ్డం నరసింహులు, ప్రతాప్ రెడ్డి, జగన్, జయరాజు మాట్లాడుతూ డిప్యూటీ డిఇఒ కార్యాలయ ఆధీనంలో దాదాపు 16 మండలాలు విద్యాశాఖ అధికారుల పరిధిలో ఉన్నాయని చెప్పారు. ఆయా మండలాల్లోని ప్రభుత్వ, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలను ఆమె విజిట్ చేసిన దాఖలాలు లేవన్నారు. ఏదైనా సమస్యను ఆమె దృష్టికి తీసుకురావాలని ఆఫీసుకు వస్తే ఆమె కడపలో ఉన్నానంటూ సమాధానమిస్తున్నారని వాపోయారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన ప్రజాసంఘాల నాయకులు బయన్న, దాసు, శ్రావణ్, రవి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా కస్తూర్బా కళాశాల

ప్రజాశక్తి - సింహాద్రిపురం

కార్పొరేట్ కళాశాలకు ధీటుగా కస్తూరిబా కళాశాల ఉందని ఎంఇఒ-2 ప్రభుదాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల కళాశాల అడ్మిషన్ల కోసం భారీ ఫ్లెక్సీ, పోస్టర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చేరేందుకు ప్రజలకు అవగాహన కల్పించేలా పోస్టర్లను ఏర్పాటు చేశామన్నారు. 6, 11 వ తరగతిలలో చేరేందుకు ఏడు ,ఎనిమిది తొమ్మిది, 10 ,12 వ తరగతిలో మిగిలిన సీట్లను భర్తీ కోసం విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బడి ఈడు పిల్లలు, బడి మానేసిన పిల్లలు, పేదలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాలకు చెందిన వారు అర్హులు అన్నారు. అన్ని రకాలైన సౌకర్యాలు మన కస్తూరిబా కళాశాలలో ఉన్నాయన్నారు. పేదలు ఆర్థిక స్తోమత లేని వారు తమ పిల్లలను కస్తూర్బాలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ కళాశాల ప్రిన్సిపల్ గురుదేవి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అరవింద్, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - బద్వేలు

ఎస్‌పి ఇ.జి. అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మైదుకూరు సబ్ డివిజనల్ ఆఫీసర్ జి. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో శుక్రవారం చట్టాలపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ రాజగోపాల్ మాట్లాడుతూ బాల బాలికల చట్టాలు , బాలికలపై జరిగే నేరాలు, ఫోక్సో చట్టాల గురించి వివరించారు. సైబర్ నేరాలకు పాల్పడిన, బాలికల పైన ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణంలో భద్రత నిమిత్తం సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సత్యనారాయణ, రవికుమార్, పోలీసు సిబ్బంది, బద్వేలు, గోపవరం మండలం విద్యాశాఖ అధికారులు, బద్వేల్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్కూల్ కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్, టీచర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్లైవుడ్ అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - బద్వేలు

నకిలీ పత్రాలతో సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమ నుంచి మెటీరియల్‌ను చోరీ చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరి నిందితులను అరెస్టు చేశామని బద్వేల్ రూరల్ సిఐ నాగభూషణం తెలియజేశారు. శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోపవరం మండలం ప్రాజెక్ట్ కాలనీ సమీపములో ఉన్న సెంచరీ ప్లయ్ వుడ్ ఫాక్టరీలో పైన్ లాజిస్టిక్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ వారిని ఆకుల మహేష్, పూంగవనం శివకుమార్ అనే వ్యక్తులు నమ్మించి మోసం చేశారన్నారు. గత నెల 20న ప్లైవుడ్ సరుకును కలకత్తాకు తరలించకుండా అక్రమంగా విక్రయించుకోవాలని ప్రయత్నించారన్నారు. ట్రాన్స్‌పోర్టు ఏజెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారమన్నారు. సరుకును కలకత్తాకు రవాణా చేయండా వాటిని నెల్లూరులోని ఓ గదిలో ఉంచి ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తాను నిందితులను పిపి కుంట సమీపంలో అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 5 లక్షలు విలువైన ప్లైవుడ్ మెటీరియల్ సొత్తును, నకిలీ రికార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిలను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. కార్యక్రమంలో బి.కోడూరు ఎస్ఐ కె.సి. రాజు పాల్గొన్నారు.

అకాల వర్షం .. పంటలకు నష్టం

వర్షానికి తడిసిన వరి
ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి
నేలకూలిన విద్యుత్ స్తంభాలు
ఆందోళనలో రైతన్నలు

ఇటీవల ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కారణంగా వరి, అరటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా కాశినాయన మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వరి పంట నీట ముగింది. కోత కోసిన వడ్లు సైతం తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఖాజీపేట మండలంలో గురువారం సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలులకు అరటి పంట పూర్తిగా దెబ్బతింది. అరటి గెలలు విరిగి కిందపడ్డాయి. ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలు అకాల వర్షానికి దెబ్బతినడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురువుతున్నారు. వివరాలు..

- ప్రజాశక్తి-కాశినాయన/ఖాజీపేట



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

నీట మునిగిన వరి..

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వరి పొలాల్లో కోత కోసి వడ్లు నీట మునిగిపోయాయి. మరోవైపు వరి పంట నీటిలోనే మునిగి పోయింది. రైతులు వరి పంటను కోత కోసి పొలాల్లోనే అరబెట్టారు. గురువారం రాత్రి ఉన్నట్టుండి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం అకస్మాత్తుగా కురిసింది. ఆ సమయంలో రైతులు ఏమి చేయాలో అర్థం కాక సతమతమయ్యారు. కోత కోసిన వడ్లను కాపాడుకునేందుకు నానా అగచాట్లు పడ్డారు. ఎలాగైన పంటను కాపాడుకోవాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఉరుములు, మెరుపుల దెబ్బకు భయపడి రైతులు బయటికి పోయే పరిస్థితి. ముఖ్యంగా మండల కేంద్రమైన నరసాపురంలోని ఓ రైతు వడ్లు చేలో ఎండబెట్టుకుంటున్నాడు,. అకాల వర్షానికి నీళ్లు రావడంతో వడ్లు అన్ని నీటమునిగాయి. దాదాపు 50 బస్తాల వడ్లు నీట మునగడంతో ఆ రైతు బాధ వర్ణణాతీతం. కొంతమంది రైతులకు చెందిన వరి పంట కోత దశకు చేరుకుంది. అకాల వర్షానికి పంట మొత్తం నేలవాలింది. నష్టపోయిన రైతులు ఏమి చేయాల్లో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు. నరసాపురంలో కరెంటు స్తంభం విరిగిపడింది. ఆ సమయంలో ప్రజలెవరూ రోడ్డుపై లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. రాత్రి 10 గంటల సమయంలో స్తంభం విరిగిపడి విద్యుత్ వైర్లు నేలపై చెల్లాచెదరుగా పడ్డాయి. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపేశారు. రాత్రి అంతా ఓవైపు వర్షం, మరోవైపు కరెంట్ లేకపోవడంతో ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారు. ఇంకో వైపు చేతి కందిన సజ్జ పంట కూడా వర్షం దెబ్బకు దెబ్బతింది. పంట కింద పడిపోతే మన సొమ్ము కాదనే భయంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. కలసపాడు మండలం కొండపేట గ్రామంలోని ఓ ఆలయంపై పిడుగు పడింది

ఫోటో రైట్ అప్ నీళ్లలో ఉదయం వడ్లు మోసుకుంటున్నా రైతులు

ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి

ఖాజీపేట : అకాల వర్షం.. బలమైన ఈదురుగాలుల వల్ల పంటలకు నష్టం వాటిల్లింది. గురువారం సాయంత్రం బలమైన ఈదురుగాలులు వీచాయి. ఈ గాలుల ఉధృతికి అరటి పంట పూర్తిగా దెబ్బతింది. మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన రైతు కొక్కిరపల్లి శశికాంత్ రెడ్డికి చెందిన అరటిపంట ఈదురుగాలులకు నేలకొరిగింది. ఆరున్నర ఎకరాలలో అరటిపంటను సాగు చేశాడు. ఈదురుగాలుల ధాటికి చెట్లు, గెలలు నేలమట్టమయ్యాయి. దాదాపు రూ. 30 లక్షల మేర నష్టం వాటిల్లిందని అన్నదాత కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



ఖాజీపేట : ఈదురు గాలులకు పడిపోయిన అరటి చెట్లు



జలమయమైన రోడ్డు

వర్షమొస్తే ప్రధాన రహదారి జలమయం

ఇబ్బందుల్లో ప్రజలు - పట్టని అధికారులు

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలోని ఓబులాపురం-నరసాపురానికి వచ్చే ప్రధాన రహదారి వర్షమొస్తే జలమయమవుతుంది. రోడ్డుపై నీరు నిలబడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి నరసాపురం బ్రిడ్జి సమీపంలో రైతుల పొలాల్లోని నీరు అంతా రోడ్డుపైకి చేరుకుంది. దీంతో రోడ్డు మొత్తం జలమయమై పాదాచారులు, ద్విచక్రవాహనదాలు, ఇతర వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అదే కొత్త వారైతే పోయే పరిస్థితి లేదు. ఈ ప్రధాన రహదారిపై బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు నిరంతరమూ తిరుగుతూ ఉంటాయి. సుమారు మోకాలి లోతు వరకు నీరు ఉండడంతో ద్విచక్రవాహనాల్లో వెళ్తే వారు అవస్థలు పడుతున్నారు. వారి వాహనాల్లో నీరు చేరి మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ ప్రధాన రహదారి మీదుగానే రోజూ తహశీల్దార్, ఎంపిడిఒ, అన్ని శాఖ మండల అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఎవరూ రోడ్డు దుస్థితిని పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. వర్షపు నీరు వల్ల శుక్రవారం ఉదయం చాలాసేపు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. కొద్దిసేపు ఆర్అండ్‌బి అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో మండల సర్వసభ్య సమావేవంలో రహదారి దుస్థితిపై ఎంపిడిఒ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా ఆర్ఎంబి అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని ప్రజల విమర్శిస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీవనోపాదుల ప్రణాళికపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో గ్రామసమాఖ్య అసిస్టెంట్లు

ప్రజాశక్తి - వేముల

స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో గ్రామ సమాఖ్య అసిస్టెంట్లకు, ఎన్యుమరేటర్‌లకు డ్వాక్రా సంఘ సభ్యుల వార్షిక రుణ, జీవనోపాదుల ప్రణాళిక పైన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ వేముల మండలం వ్యాప్తంగా 600 డ్వాక్రా గ్రూపులకుగాను 6125 మంది డ్వాక్రా మహిళలకు 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో రుణాలు అందించనున్నామని, అందుకు సంబంధించి జీవనోపాదుల ప్రణాళికను ఎన్యూమరేటర్‌లు తయారు చేయాలన్నారు. . మండల వ్యాప్తంగా 120 మంది ఎన్యూమరేటర్లు డ్వాక్రా సంఘాల సమావేశాలు నిర్వహించి ప్రతి సభ్యుల కుటుంబ వార్షిక రుణం జీవనోపాదుల ప్రణాళికను తయారు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యదర్శి రజిత, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు, ఎన్యూమరేటర్లు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు జయపాల్, జ్యోతి, గంగరాజు, హరికృష్ణ,మండల సమాఖ్య అకౌంటెంట్ చిన్నరెడ్డి పాల్గొన్నారు.

వల్లూరు ఎస్ఐగా పెద్ద ఓబన్న

ప్రజాశక్తి - వల్లూరు



వల్లూరు ఎస్ఐగా పెద్ద ఓబన్న శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. గత కొన్ని నెలలుగా ఎస్ఐ స్థానం ఖాళీగా ఉంది. అప్పటినుంచి కమలాపురం ఎస్ఐ వల్లూరు ఎస్ఐగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అ జిల్లా వ్యాప్తంగా 16 మంది ఎస్ఐల బదిలీల నేపథ్యంలో తొండూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పెద్ద ఓబన్నను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎవరైనా అక్రమాలకు, దొంగతనాలకు, జూదం, గుట్కా, మట్కా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రొద్దుటూరు టూటౌన్ సిఐగా సదాశివయ్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



ప్రొద్దుటూరు టూ టౌన్ సిఐగా శుక్రవారం సదాశివయ్య బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి పిటిసి నుంచి ప్రొద్దుటూరుకు ఆయన బదిలీపై వచ్చారు. గతంలో ఈయన ప్రొద్దుటూరు టూ టౌన్, ఎర్రగుంట్ల, అనంతపురంలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం తిరిగి పట్టణంలో టూ టౌన్ సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని వివరించారు.

మినరల్ వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం : ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రజలు చేసుకోవాలని ఎంపిడిఒ కార్యాలయ ఎఒ శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎల్‌సి హై కెనాల్ ప్రాజెక్టు చైర్మన్ జోగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో ప్లాంటును ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి వెంకటరాముడు, టిడిపి నాయకులు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి
ఘనంగా గురుకుల విద్యాపీఠ్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం గురుకుల విద్యాపీఠ్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి, ఎవిఆర్ విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ఎ. వీర కుమారి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యుకెజి నుంచి ఐదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంత ఎత్తు ఎదిగిన పాఠశాల జీవితాన్ని మరువకూడదని చెప్పారు. గురుకుల్ విద్యాపీఠ్, ఎవిఆర్ విద్యాసంస్థలు విద్యను అందించడంలో ముందు వరుసలో ఉందని కొనియాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తూ ఉందని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సిఇఒ ఎ.ఎల్. వివేకానంద, పాఠశాల ప్రిన్సిపల్ మునిచంద్ర, వైస్ ప్రిన్సిపల్ ఇ. నరసింహులు, క్యాంపస్ ఇన్చార బాబా ఫక్రుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

అరణ్య స్విమ్మింగ్ పూల్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్



స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నగరంలోని పెన్నా కాంపౌండ్ ఎదురుగా చలమారెడ్డిపల్లి బైపాస్ దగ్గర అరణ్య స్విమ్మింగ్‌పూల్‌ను ఓనర్ సుబ్బారెడ్డి ఆహ్వానం మేరకు టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు. శుక్రవారం స్విమ్మింగ్ పూల్ యజమాని సుబ్బారెడ్డి ఆహ్వానం మేరకు వీరు హాజరై రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈత నేర్చుకోవడానికి, ఆరోగ్యం కోసం స్విమ్మింగ్ పూల్ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివారెడ్డి, కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, మానస, సుదర్శన్ రెడ్డి, అరుణ,రాజశేఖర్ రెడ్డి, సూర్యనారాయణ, నాగేంద్ర కుమార్, జప్రుల్లా, టిడిపి నాయకులు నానాపల్లె నారాయణరెడ్డి, రాడ్ బెండర్ శంకర్, మునిస్వామి, రాయచోటి శ్రీకాంత్, చలమారెడ్డి పల్లె దాసు కరిముల్లా, రాజగోపాల్ రెడ్డి, చిన్నబాబు, అడ్వకేట్ గౌతమ్, రమణారెడ్డి మన్సూర్ అలీ ఖాన్, ఖాజా పీర్, రవితేజ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- కడప అర్బన్

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్ రెడ్డి అన్నారు. బాబు జగజ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రఘునాథ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన జగ్జీవన్ రామ్ అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. భారత ప్రభుత్వంలో అతిచిన్న వయసులోనే మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి సామాజిక న్యాయం కోసం కృషి చేశారన్నారు. 1971 ఇండో-పాక్ యుద్ధం జరిగిన సమయంలో భారత రక్షణ మంత్రిగా క్రియాశీలంగా వ్యవహరించారని, అలానే భారతదేశంలో హరిత విప్లవం, భారత వ్యవసాయాన్ని ఆధునీకరించడంలో చేసిన కృషి కీర్తించ తగిందన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిగా ఆహార సంక్షోభాన్ని నివారించడంలో ఆయన పనితీరు అద్వితీయనీయమన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కెఎస్వీ కృష్ణారావు, ప్రొఫెసర్ నజీర్ అహ్మద్, ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు పి.సరిత, శ్రీనివాస గౌడ్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంపై వైసిపి ద్వంద్వ వైఖరి : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంపై వైసిపి ద్వంద్వ వైఖరి అవలంభిస్తుందని టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ద్వారకా నగర్‌లో ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైసిపి 22 మంది ఎంపీలు సవరణకు అనుకూలంగా ఓట్లు వేశారా లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులకు రక్షణ కల్పించింది టిడిపి ప్రభుత్వమే అన్నారు. ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు ఇస్తుందని పేర్కొన్నారు., హజ్ హౌస్ నిర్మించి ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి చంద్రబాబు కృషి చేశారని చెప్పారు. కడపలో డాక్టర్ ఖలీల్ బాషా కు రెండుసార్లు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన ఎన్టీఆర్ మంత్రి పదవి ఇచ్చారని గుర్తు చేశారు. ముస్లిం మైనార్టీలకు చంద్రబాబు ఉన్నత స్థానం కల్పించారని తెలిపారు. వారి అభ్యున్నతికి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని చెప్పారు. బిల్లు సవరణ ప్రతిపాదించిన పార్టీ టిడిపినే అన్నారు.

మురికికూపంగా వేంపల్లె పంచాయతీ : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె పంచాయతీ మురికి కూపంగా తయారైందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి సమస్యలపై సీనియర్ అసిస్టెంట్ హరితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లె గ్రామ పంచాయతీ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నట్లు చెప్పారు. చెత్త చెదారంతో నిండి పోయిందన్నారు. మార్చి 5న అప్పటి ఇఒను అక్రమాలు జరిగాయని సస్పెండ్ చేశారని తెలిపారు. ఇఒపిఆర్‌డి బదిలీ చేశారని చెప్పారు. అట్లూరు ఇఒపిఆర్‌డి శివప్రసాద్‌ను ఇన్‌ఛార్జ్‌గా వేసినా ఆయన చేరలేదని తెలిపారు. ఇక్కడికి ఇఒగా ఎవ్వరు రావాలన్నా అవినీతి ఆరోపణలు, రాజకీయ జోక్యంతో భయపడి పోతున్నారని చెప్పారు. పారిశుధ్యం, వాటర్ స్కీమ్ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు లేవని అన్నారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, రామాంజనేయ రెడ్డి, అమర్‌నాథరెడ్డి, ఉత్తన్న, బద్రినాథ్, నాగరాజు, రమణ, వినయ్, మదార్, చందు, గంగోజీ, గంగ రాజు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

7 నుంచి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - సింహాద్రిపురం : ఈనెల 7 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమవుతున్నాయని సింహాద్రిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక కళాశాలలో మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చు అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఆధ్వర్యంలో సిబిఎస్ఇ సిలబస్‌లో విద్య బోధన ఉంటుందన్నారు. కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, తెలుగు, ఇంగ్లీషు మీడియం, ఎంబైపిసి ఇంగ్లీషు మీడియం, హెచ్ఇసి తెలుగు మీడియం గ్రూపులున్నాయని పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు తమ స్టడీ సర్టిఫికెట్, టిసి తీసుకొని వచ్చి కళాశాలలోఅడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపల్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : పట్టణంలోని మెయిన్ రోడ్డు, అంబకపల్లె రోడ్డు, బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాలలో శనివారం సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ ఎఇ జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు. **ముద్దనూరు :** స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో లైన్ల మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎఇ శ్రీనివాస రాజ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, ప్రజలు గమనించి సహకరించాలని ఎఇ కోరారు.

మా స్థలాలు ఇప్పించండి

ప్రజాశక్తి - బద్వేలు

కబ్జాదారుల నుంచి తమ స్థలాలను ఇప్పించాలని రజకులు కోరారు. శుక్రవారం వారు టిడిపి సమన్వయకర్త రితీష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం రజక సంఘం నాయకులు మాట్లాడుతూ బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె పంచాయతీ గ్రామ పొలం సర్వేనెంబర్ 812 లో 27 ఏళ్ల కిందట అప్పటి మంత్రి బిజివేముల వీరారెడ్డి రజకులకు 66 ప్లాట్లు, 3 ఎకరాల 30 సెంట్లు కేటాయించి డి పట్టాలు ఇచ్చారని చెప్పారు. మూడు రోజుల కిందట కొంతమంది కబ్జాదారులు ఆ స్థలాలలో ఉన్న బేస్‌మట్టాలను డోజర్‌తో కూలదోశారని పేర్కొన్నారు. తమ స్థలాలను ఇప్పించాలని కోరడంతో వెంటనే రితీష్‌రెడ్డి తహశీల్దార్‌తో ఫోన్లో మాట్లాడారు. అనంతరం న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో రజక సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు నరసయ్య, రామయ్య , సుబ్బయ్య, నాగయ్య పాల్గొన్నారు.